క్లుప్తంగా

ఓటేస్తే.. ఉచితంగా కంటి పరీక్షలు

గుంటూరు మెడికల్: దేశంలో ప్రఖ్యాతిగాంచిన వాసన్ ఐ కేర్ సంస్థ సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ప్రజలకు ప్రత్యేక ఆఫర్‌ను ప్రకటించింది. ఈ నెల 13 ఓటేసిన తర్వాత వేలికి ఉన్న ఇంక్‌ను తమ ఐ కేర్ సెంటర్‌లో చూపిస్తే ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపింది. అంతేగాకుండా ఉచిత కంటి పరీక్షలు తర్వాత అవసరమైన సందర్భంలో చేసే చికిత్సకు, సర్జరీలకు కూడా ఆఫర్‌ను ప్రకటించింది. ఓటు వేసిన వారికి ఉచితంగా కంటి పరీక్షలు చేయడంతో పాటుగా చికిత్సకు, సర్జరీ చేస్తే వాటిలో డిస్కౌంట్ ఆఫర్ ప్రకటించింది. చికిత్స, సర్జరీలకు విధించే చార్జీలలో పది శాతం వరకు తగ్గింపు అందిస్తామని ఆ సంస్థ తెలిపింది. ఈ ప్రత్యేక ఆఫర్‌ను ఈ నెల 13 నుంచి 25వ తేదీ వరకు వినియోగించు కోవచ్చునని వెల్లడించింది. ప్రజాస్వామ్యబద్ధంగా లభించిన ఓటు హక్కు వినియోగంపై ప్రజల్లో మరింత చైతన్యం, అవగాహన కలిగించేందుకు ఈ తరహా ప్రకటన చేసినట్లు వాసన్ ఐ కేర్ పేర్కొంది. గుంటూరు నగరం, కొత్తపేట శివాలయం ఎదురుగా ఉన్న వాసన్ ఐ కేర్ సెంటర్‌లో కంటి పరీక్షలు, ఆపరేషన్‌ల కోసం ఓటు వేసిన వారు సంప్రదించాలని పీఆర్వో వెంకట్రావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఎన్డీయే కూటమితో రాజ్యాంగానికి ముప్పు

నెహ్రూనగర్: ఎన్డీయే కూటమికి ఓట్లు వేస్తే భారత రాజ్యాంగాన్ని మార్చేయడంతో పాటు అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురి చేసే అవకాశం ఉందని మాదిగ లాయర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పుసులూరి జీవా పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఏసీ కాలేజీ ఎదురుగా ఉన్న అసోసియేషన్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టేందుకు మాత్రమే బీజేపీతో టీడీపీ, జనసేన పొత్తు పెట్టుకున్నాయని మండిపడ్డారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే జగన్ తిరిగి సీఎంని చేస్తాయని ఓటమి భయంతో అమలు కాని హామీలు ఇచ్చి ఎలాగైన అధికారంలోకి రావాలని కుయుక్తులు పన్నుతున్నారని మండిపడ్డారు. కూటమికి తగిన బుద్ధి చెప్పాలని కోరారు.

వైఎస్సార్ సీపీని గెలిపిస్తేనే బీసీల అభ్యున్నతి



నెహ్రూనగర్: బీసీల అభ్యున్నతి వైఎస్సార్ సీపీతోనే సాధ్యమని.. ఆ పార్టీని గెలిపిస్తేనే బీసీల అభివృద్ధి సాధ్యమవుతుందని ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ కె.నారాయణ ముదిరాజ్ పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ గెలుపు కాంక్షిస్తూ పశ్చిమ నియోజకవర్గంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో బీసీలను చిన్న చూపడంతో రాజకీయంగా చంద్రబాబునాయుడు ఎదగనివ్వలేదని మండిపడ్డారు. కాని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయిన తరువాత బీసీలకు రాజకీయ పరంగా అగ్రతాంబూలం కల్పించారన్నారు. టీడీపీకి ఓట్లు వేస్తే బీసీలు మరింత అగాధంలోకి వెళ్లే పరిస్థితి ఉందన్నారు. బీసీల అభ్యున్నతి కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌ను గెలిపించుకునేందుకు పశ్చిమ నియోజకవర్గంలో పోటీ చేస్తున్న మంత్రి విడదల రజినిని గెలిపించుకోవాలని బీసీలకు పిలుపునిచ్చారు.

రాష్ట్రమంతా ఫ్యాను గాలి

- టీడీపీకి మరోసారి భంగపాటు తప్పదు
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- 35వ డివిజన్‌లో గడపగడపకూ మన రజినమ్మ కార్యక్రమం
- హాజరైన ఎమ్మెల్యే మద్దాలి గిరిధర్



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మంత్రి రజిని, ఎమ్మెల్యే గిరి, తదితరులు

పట్నంబజారు: రాష్ట్ర మంతా ఫ్యాను గాలే వీస్తోందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. స్థానిక 35వ డివిజన్‌లో మనతో మన రజినమ్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారం చేపట్టారు. స్థానిక పట్టాభిపురం స్వామి థియేటర్ నుంచి ప్రారంభమైన ప్రచారం ఒకటో లైను, రెండో లైను, మూడో లైను మీదుగా రవీంద్రనగర్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంటేనే ఒక నమ్మకం అని చెప్పారు. 2019 మేనిఫెస్టోలో పేర్కొన్న అంశాలను 99 శాతం పూర్తిచేసిన గొప్ప నాయకుడు జగనన్న అని తెలిపారు. విద్య వైద్యం, వ్యవసాయ రంగాల్లో అద్వితీయ సంస్కరణలు తీసుకొచ్చి రాష్ట్ర భవితకు కొత్త మార్గం జగనన్న చూపారని పేర్కొన్నారు. మరోవైపు చంద్రబాబునాయుడు మేనిఫెస్టోను చిత్తుకాగితంతో సమానం చూస్తారని ఎద్దేవా చేశారు. 2014 మేనిఫెస్టోను చెత్త బుట్టలో వేసి పచ్చి మోసం చేశారని ధ్వజమెత్తారు. మళ్లీ ఇప్పుడు సూపర్... మోసానికి తెరలేపారని పేర్కొన్నారు. 2024 మేనిఫెస్టోలో అసాధ్యమైన హామీలు ఇచ్చారని దుయ్యబట్టారు. 2014లో ఇదే చంద్రబాబునాయుడు, మోదీ, పవన్ కల్యాణ్ కూటమిగా ఏర్పడి ఇంటింటికీ పంపిన పాంప్లెట్‌లో ఒక్క హామీని కూడా నెరవేర్చలేకపోయారని ధ్వజమెత్తారు. అందుకే ఈ ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకే ఓటేసి నమ్మకానికి ప్రతిరూపమైన జగనన్నను గెలిపించుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. చంద్రబాబునాయుడికి కూడా ఓటమి భయం బాగా పట్టుకుందని, అందుకే కుట్రలకు తెరలేపారని ధ్వజమెత్తారు. అవ్వాతాతలకు ఇంటికే పింఛన్లు వస్తుంటే వాటిని అడ్డుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పథకాలు కూడా అమలు కాకుండా అడ్డుకున్నారని దుయ్యబట్టారు.

పథకాలను అడ్డుకోవడం దుర్మార్గం..

ప్రభుత్వ పథకాలను అడ్డుకోవడం ద్వారా టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు పాపం మూటగట్టుకున్నారని స్థానిక పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే, పార్టీ నగర అధ్యక్షుడు మద్దాళి గిరిధర్ పేర్కొన్నారు. వారు ఆపింది పథకాలను కాదని, అవ్వాతాతల ఆయుష్షనని చెప్పారు. అక్కచెల్లెమ్మల సంతోషాన్ని అడ్డుకున్నారని దుయ్యబట్టారు. రైతన్నలు, విద్యార్థుల భవిష్యత్‌ను అడ్డుకున్నారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి టీఎల్‌వీ ఆంజనేయులు, డివిజన్ నాయకులు గుంజర ప్రభుదాసు, మాణిక్యరావు, గంగాధర్, జి.అంజి, దేవదానం, పేరూరి అజయ్, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

పోలింగ్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

- పశ్చిమ పరిధిలో 292 బూత్‌ల ఏర్పాటు
- 218 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్
- ఆర్వో రాజ్యలక్ష్మి



డిస్ట్రిబ్యూషన్ పాయింట్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న పశ్చిమ ఆర్‌ఓ రాజ్యలక్ష్మి

నెహ్రూనగర్: సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు పశ్చిమ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కె.రాజ్యలక్ష్మి తెలిపారు. లాడ్జి సెంటర్‌లోని ఏఎల్ బీఈడీ కళాశాలలో డిస్ట్రిబ్యూషన్‌కు సంబంధించి ఏర్పాట్లను శనివారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ సోమవారం నిర్వహించనున్న పోలింగ్‌కు 292 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఓటర్లు పోలింగ్ కేంద్రంలో ఓటు వేయడానికి ఏ సమస్య లేకుండా సమగ్ర ఏర్పాట్లు చేశామని, వికలాంగుల కోసం ర్యాంప్‌లు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. బీఎల్‌ఓల ద్వారా ఓటర్ల స్లిప్‌లు పంపిణీ చేయడం జరిగిందని చెప్పారు. పోలింగ్ రోజు ఓటరు గుర్తింపు కార్డు(ఎపిక్ కార్డ్) తీసురావాలని, ఓటర్ గుర్తింపు కార్డ్ లేకుంటే ఎన్నికల కమిషన్ సూచన మేరకు పాస్ పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్, ప్రభుత్వ ఉద్యోగుల సర్వీస్ గుర్తింపు కార్డు, ఫొటో ఉన్న బ్యాంక్ అకౌంట్ పాస్ బుక్, పాన్ కార్డు, నేషనల్ పాపులేషన్ రిజిస్టర్(ఎన్.పి.ఆర్.) పరిధిలోని రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా(ఆర్.జి.ఐ.) జారీ చేసిన స్మార్ట్ కార్డ్, ఉపాధి హామీ గుర్తింపు కార్డు, కార్మిక శాఖ జారీ చేసిన హెల్త్ ఇన్సూరెన్స్ కార్డు, ఫొటో ఉన్న పెన్షన్ కార్డు, ప్రజా ప్రతినిధులకు జారీ చేసిన అధికార గుర్తింపు కార్డు, ఆధార్ కార్డ్ వంటి 11 గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి పోలింగ్ అధికారులకు చూపించి ఓటు హక్కు వినియోగించుకోవచ్చని వెల్లడించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో తాగునీరు, టాయ్ లెట్స్, లైటింగ్, టెంట్‌లు, కుర్చీలు వంటి మౌలిక వసతులు కల్పించినట్లు చెప్పారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల దూరంలోపు పార్టీల కార్యాలయాలు ఉండకూడదన్నారు. పశ్చిమ నియోజకవర్గంలోని మొత్తం 292 పోలింగ్ కేంద్రాల్లో 218 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ చేయుటకు చర్యలు తీసుకున్నామన్నారు. పశ్చిమ నియోజకవర్గంలో 2,78,158 మంది ఓటర్లు ఉండగా, వారిలో పురుషులు 1,35,426, మహిళలు 1,42,688, ఇతరులు 44 మంది ఉన్నారని తెలిపారు. ఎన్నికల విధుల పర్యవేక్షణ, క్షేత్ర స్థాయిలో అధికారుల నుండి అందే ఫిర్యాదులు, సూచనల పర్యవేక్షణకు లాడ్జి సెంటర్‌లోని ఏఎల్ బీఈడీ కాలేజ్‌లో కంట్రోల్ రూమ్‌ని ఏర్పాటు చేశామని తెలిపారు.

నూరు శాతం ఓటింగ్ ద్వారానే ప్రజాస్వామ్యం పరిపుష్టం

'లెట్స్ ఓట్' ఆర్గనైజేషన్ చైర్మన్ ప్రొఫెసర్ కె.మాల కొండయ్య



అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న లెట్స్ ఓట్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు, విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్యమైన భారతదేశంలో ఓటింగ్ నూరు శాతం జరిగేలా యువత, విద్యార్థులు ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొనాలని 'లెట్స్ ఓట్' ఆర్గనైజేషన్ రాష్ట్ర చైర్మన్ ప్రొఫెసర్ కె.మాల కొండయ్య పేర్కొన్నారు. 40 రోజులుగా గుంటూరు నగరంలోని ఓటర్లలో ప్రజాస్వామ్య విలువలు, ఓటు ప్రాధాన్యం చాటుతూ చైతన్య పరుస్తున్న లెట్స్ ఓట్ ఆర్గనైజేషన్, రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు సంయుక్త ఆధ్వర్యంలో శనివారం లాడ్జి సెంటర్లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి మొదటిసారిగా ఓటు హక్కు వినియోగించుకోనున్న యువతీ, యువకులతో కలసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా లెట్స్ ఓట్ గుంటూరు చాప్టర్ కన్వీనర్ టి.బాలాజీ శ్రీనివాస్ మాట్లాడుతూ ఓటు హక్కు ప్రాధాన్యం తెలియజేస్తూ నగరంలోని వివిధ ప్రాంతాల్లో ప్రజలను చైతన్య పరిచినట్లు పేర్కొన్నారు. ప్రజా ఆలోచన వేదిక అధ్యక్షుడు మేడూరి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన లెట్స్ ఓట్ ఆర్గనైజేషన్ బలోపేతానికి విద్యార్థులు, యువకులు ముందుండి నడిపించాలని కోరారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ మద్దినేని సుధాకర్, రోటరీ క్లబ్ అధ్యక్షుడు కేవీ భాస్కర్, సీతా రమేష్, వల్లూరి సదాశివరావు పాల్గొన్నారు.

మళ్లీ వైఎస్ జగన్‌ను సీఎంను చేసుకునేందుకు క్రైస్తవులు సిద్ధం

నెహ్రూనగర్: సీఎం వైఎస్ జగన్‌ను తిరిగి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు క్రైస్తవులంతా సిద్ధంగా ఉన్నారని కరుణ మినిస్ట్రీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు డొక్కా జార్జి పేర్కొన్నారు. శనివారం భాగ్యనగర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. క్రైస్తవులకు వ్యతిరేకంగా మాట్లాడుతున్న బీజేపీ ఆ పార్టీకి మద్దతు ఇస్తున్న తెలుగుదేశం, జనసేన పార్టీలను క్రైస్తవులు ఓడించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పాస్టర్ సీహెచ్ రవి మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో క్రైస్తవులపై జరిగిన మరణకాండకు బీజేపీ ముఖ్య కారణమన్నారు.

రాష్ట్రంలో బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీలన్నీ కూడా క్రైస్తవులకు వ్యతిరేకంగా పనిచేస్తున్నాయన్నారు. పాస్టర్ కె.జోసఫ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ పాలనలో అన్నిమతాలు, కులాలు, ప్రాంతాల వారిని సమానంగా చూస్తున్నారని అన్నారు. క్రైస్తవులకు వైఎస్ జగన్ పాలనలో ఎంతో మేలు జరిగిందని, రేపు జరిగే ఎన్నికల్లో కూటమిని ఓడించి వైఎస్సార్ సీపీ గెలిపించి సీఎం వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎంని చేసుకోవాలని కోరారు.

అందుబాటులో లేని లోకేష్

మంగళగిరి: ఎన్నికల్లో కీలకమైన చివర రెండు రోజులు నారా లోకేష్ అందుబాటులో లేకపోవడంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు డీలాపడ్డారు. గురువారం రాత్రి ప్రచారంలో పాల్గొన్న లోకేష్ వెంటనే తిరుపతి వెళ్లారు. శుక్ర, శనివారాల్లో టీడీపీ ప్రచారం నిర్వహించలేదు. దీంతో నాయకులు, కార్యకర్తలు అసంతృప్తి వ్యక్తం చేస్తుండగా ఇలాగైతే ఎలా గెలుస్తామని నిరాశకు లోనవుతున్నారు. ఓటమి తప్పదని తెలుసుకున్న లోకేష్ ముందే నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో లేకుండా పోయారని, ఇక ప్రజలు ఎలా నమ్మి ఓట్లు వేస్తారని టీడీపీ నాయకులు వాపోతున్నారు.

సమగ్ర వికాసంతో నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకోవాలి

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృపాసాగర్



మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రపంచీకరణ నేపథ్యంలో విద్యార్థులు సమగ్ర వికాసంతో నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకోవాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ అన్నారు. శనివారం జేకేసీ కళాశాల 56వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జస్టిస్ కృపాసాగర్ మాట్లాడుతూ మనిషి సమగ్ర వికాసానికి విద్య దోహదం చేస్తుందన్న స్ఫూర్తితో ఐదున్నర దశాబ్దాలకు పూర్వమే జాగర్లమూడి కుప్పుస్వామి స్ఫూర్తితో నెలకొల్పిన జేకేసీ కళాశాల ఖ్యాతి విస్తరించటం అభినందనీయమని అన్నారు. అనంతంగా విస్తరించిన విద్యా, జ్ఞానాన్ని అందిపుచ్చుకుని విద్యార్థులు ప్రతిభావంతులుగా ఎదగాలని సూచించారు. ర్యాంకులు, మార్కులతో కాకుండా కమ్యూనికేషన్ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్మెంట్, కరెంట్ అఫైర్స్, కంప్యూటర్ పరిజ్ఞానంతో పాటు శారీరక, మానసిక వికాసానికి దోహదపడే క్రీడలు, పోటీ పరీక్షలపై ఆసక్తి కనబర్చాలన్నారు. తొలుత కళాశాల మూల స్తంభాలైన జాగర్లమూడి చంద్రమౌళి, జాగర్లమూడి నరేంద్రనాథ్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కళాశాల కార్యదర్శి జాగర్లమూడి మురళీ మోహన్ మాట్లాడుతూ కళాశాల ఆడిటోరియాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. కళాశాల పాలక మండలి అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ జేకేసీ కళాశాల గత 10 ఏళ్లుగా యూజీసీ ఏ గ్రేడ్ గుర్తింపు పొందుతూ విద్యా ప్రమాణాల స్థాయిని నిలబెడుతోందని అన్నారు. కార్యక్రమంలో పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్ఆర్‌కే ప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఇంటూరి నాగేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ పరుచూరి గోపీచంద్ పాల్గొన్నారు.

ముగిసిన ఎన్నిక ప్రచార పర్వం

నెహ్రూనగర్: సార్వత్రిక ఎన్నికల ప్రచారం శనివారంతో సాయంత్రం 6 గంటలకు ముగిసింది. రాజకీయ పార్టీలన్నీ కూడా పోటాపోటీగా వీధుల్లో ప్రచారం చేస్తూ హోరెత్తించారు. 48 గంటల ముందు ప్రచారాలు నిలిపివేయాలని ఎన్నికల కమీషన్ స్పష్టమైన ఆదేశాలతో అంతా మూగబోయాయి.

హోరాహోరీగా ప్రచారాలు: సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ మార్చి 16న వెలువడింది. ఆ రోజు నుంచి ప్రధాన రాజకీయ పార్టీలైన వైఎస్సార్ సీపీ, టీడీపీ కూటమి, కాంగ్రెస్ పాటు ఇతర పార్టీలు హోరాహోరీగా ప్రచారాన్ని సాగించాయి. ఆయా పార్టీల అధినేతలను ప్రచారానికి రప్పించాయి. కోడ్ అమలులో ఉన్న తరువాత వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, చంద్రబాబునాయుడు, నగరంలో ప్రచారాన్ని నిర్వహించారు.

మద్యం విక్రయాలు బంద్ : ఎన్నికల నేపథ్యంలో శనివారం సాయంత్రం 6 నుంచి 13వ తేదీ సాయంత్రం 6గంటల వరకు మద్యం విక్రయాలు నిలిపివేస్తూ ఎన్నికల అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ప్రజా ప్రాతినిధ్య చట్టం సెక్షన్ 135–సీ ప్రకారం 'డ్రైడే' పాటించాలి. దీనిని పాటించని మద్యం దుకాణాలపై కఠిన చర్యలు తీసుకుంటారు. అలాగే ఓట్ల లెక్కింపు రోజు కూడా మద్యం విక్రయాలపై నిషేధం ఉంటుంది. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని ఇప్పటికే ఎక్సైజ్ అధికారులకు ఎన్నికల అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

కూటమికి ముస్లింలు బుద్ధి చెప్పాలి

లక్ష్మీపురం: టీడీపీ కూటమికి సోమవారం నిర్వహించనున్న పోలింగ్‌లో ఓటుతో బుద్ధి చెప్పాలని ముస్లిం యునైటెడ్ ఫ్రంట్, ముస్లిం జేఏసీ అధ్యక్షుడు మహమ్మద్ కలీం పిలుపు నిచ్చారు. స్థానిక సంఘ కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. ముస్లింల ఓట్లు అవసరం లేని, ముస్లింలకు సీట్లు ఇవ్వని బీజేపీ, అదే బాటలో పయనిస్తున్న జనసేన, తెలుగుదేశంలకు ఓటు అడిగే హక్కు లేదని పేర్కొన్నారు. చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో హిందూ ముస్లింలు రెండు కళ్లు అని ప్రకటన ఇస్తే ముస్లింలు నమ్మేస్తారా అని ప్రశ్నించారు.

ముగిసిన అయోధ్య రామ ఉత్సవ్-2024



ధ్రువీకరణ పత్రాలతో చిన్నారులు

నగరంపాలెం: భరతముని కూచిపూడి నృత్య కళాక్షేత్రం నిర్వహణలో సేవ్ కూచిపూడి ఆర్టిస్ట్స్ సౌజన్యంతో బృందావన్‌గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలోని పద్మావతి, అన్నమయ్య కళ్యాణ వేదికలపై నిర్వహిస్తోన్న అయోధ్య రామ ఉత్సవ్-2024 రామ్‌లల్లా పురస్కార నృత్యోత్సవం శనివారంతో ముగిశాయి. రెండు రోజుల పాటు నిర్వహించిన నృత్యోత్సవాన్ని ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నాట్యాచార్యులు, వందల మంది శిష్యులు రాకతో వేదిక వద్ద సందడి వాతావరణం నెలకొంది. ఆర్‌వీఆర్/జేసీ కళాశాల ఆచార్యులు డాక్టర్ మద్దినేని సుధాకర్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలకు చెందిన నాట్యాచారులు, వారి శిష్యులను రెండు వేదికలపై నృత్య ప్రదర్శనలు యిప్పించడం అభినందనీయమని అన్నారు. ప్రముఖ నాట్యాచారిణి వి.రంగమణి అధ్యక్షత వహించగా, సేవ్ కూచిపూడి వ్యవస్థాపకులు భావన పెద్దప్రోలు, ఆలయ పాలకమండలి అధ్యక్షులు సీహెచ్.మస్తానయ్య, విద్యావేత్త ఎన్.తిరుపతయ్య, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ వై.షేక్, నాట్యాచారులు ఘంటసాల పవన్ కుమార్, వెంకటేశ్వర్లు, పలువురు నాట్యాచారులు పాల్గొన్నారు. అనంతరం నిర్వాకురాలు రంగమణి దంపతులను సత్కరించగా, గురువులు, చిన్నారులకు ధ్రువీకరణ పత్రాలు, జ్ఞాపికలు అందించారు.